
2025 HAPPY New Year
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
బుధవారం 1 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 19.4

సంక్షేమ ఫలాలు ప్రజల చెంతకు



- విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం
- ప్రభుత్వ పథకాల అమలుకు క్షేత్రస్థాయిలో పరిశీలన
- విద్య, వైద్యంపై స్పెషల్ ఫోకస్
- నిత్యం ఆస్పత్రులు, పాఠశాలలు, హాస్టళ్లలో తనిఖీలు, రాత్రి బస
- స్థానిక సంస్థల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేకాధికారులపై పర్యవేక్షణ
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ ఎం.హనుమంతరావు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలి.. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు.. జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ, ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నాం.. ఉద్యోగులంతా సమయపాలన పాటించాలి.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఆర్థిక, సామాజిక, కుల గణన ఇంటింటి సర్వేను విజయవంతంగా చేపట్టాం.. జిల్లాలోని రుణమాఫీ, రైతు బీమా, పీఎం కిసాన్, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు సకాలంలో అందించేలా పర్యవేక్షిస్తున్నాం.. అని కలెక్టర్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ విశేషాలు ఇలా..

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో పాటు రైతుల రుణమాఫీ, తదితర పథకాలను అమలు చేస్తోంది. వాటిని అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందించేలా కృషి చేస్తు న్నాం. జిల్లాలో ధరణి సమస్యలు చాలా వరకు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తనిఖీచేస్తున్నాం. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేస్తున్నాం.



సంస్థాన్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో రాత్రి నిద్ర చేసిన కలెక్టర్ హనుమంతరావు (ఫైల్)

నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి. విధుల్లో నిర్లక్ష్యం చూపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాల్లోని పలు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, వైద్యశాలలను తనిఖీచేసి ప్రజలకు, విద్యార్థులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్నాం. ఆస్పత్రులకు వైద్యం కోసం ప్రజలు ఎంతో నమ్మకంతో వస్తారు. వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, పీహెచ్‌సీలను, ఏరియా ఆస్పత్రులను నిత్యం అధికారులతో తనిఖీలు చేయిస్తున్నాం. అయా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీసి, రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలువురికి షోకాజ్ జారీ చేశాం. వైద్యులు సకాలంలో ఆస్పత్రులకు వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం. వైద్యులతో నిత్యం గూగుల్ మీట్ నిర్వహిస్తున్నాం. రోగులతో నేరుగా మాట్లాడించేలా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతగా ఉండాలని ఆదేశాలు జారీచేశాం. పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మెనూ అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యమైన భోజనం అందించని వారికి షోకాజ్‌తో పాటు సస్పెన్షన్ ఆదేశాలు జారీచేస్తున్నాం.

ప్రత్యేకాధికారులపై పర్యవేక్షణ

జిల్లాలో మొత్తం 17 మండలాలు, 421 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. ప్రస్తుతం జడ్పీ, మండల పరిషత్‌ల పాలకవర్గం గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు తీసుకున్నా. మండల పరిషత్, గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించాం. గ్రామాల్లో పరిపాలనాపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశాం. నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ, స్థానిక సంస్థల పాలనను పర్యవేక్షిస్తున్నాం. అధికారుల పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కారించాల్సిన..

- మిగతా 8వ పేజీలో...

హాస్టళ్లలో రాత్రి బస

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాం. కలెక్టర్‌తో పాటు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు హాస్టళ్లల్లోనే రాత్రి బసచేయాలని నిర్ణయించాం. నారాయణపూర్‌లోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో నేను రాత్రి బస చేశా. విద్యార్థులతో కలిసి రాత్రి నిద్ర చేయడంతో పాటు వారికి అందిస్తున్న భోజనం, దినచర్య గురించి అడిగి తెలుసుకున్నా. స్టాక్ రిజిస్టర్, స్టోర్‌రూం, నిత్యావసర వస్తువులు, గుడ్లు, కూరగాయలు, ఇతర సరుకులను స్వయంగా పరిశీలించా. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.



నూతన సంవత్సరంపై పట్టణవాసులు కోటి ఆశలు పెట్టుకున్నారు. 1953 నుంచి మునిసిపాలిటీగా, పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చిన కొత్తలో తాలూకా కేంద్రంగా, అనంతరం డివిజన్ కేంద్రంగా భువనగిరి ఏర్పడింది. అలాగే మొదటి నుంచి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా, 15 సంవత్సరాల క్రితం పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంగా, జిల్లాల పునర్విభజనతో ఏడేళ్ల క్రితం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. ప్రభుత్వ వ్యవస్థలపరంగా భువనగిరి పట్టణానికి గుర్తింపు లభిస్తున్నా అభివృద్ధిలో మాత్రం వెనుకంజలోనే ఉంది. ఈ నేపథ్యంలో 2025 సంవత్సరంలోనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలు తీరుస్తారని, పట్టణాభివృద్ధికి కృషి చేస్తారని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లా ప్రజలు 31న అర్ధరాత్రి పాత ఏడాదికి వీడ్కోలు, కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ సంబరాలు చేసుకున్నారు. వీధుల్లోకి వచ్చిన యువత, ముగ్గులు వేస్తూ మహిళలు అర్ధరాత్రి వరకు సందడి చేశారు.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)



నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో గుట్ట ఆలయానికి రానుండటంతో గ్రిల్స్ ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

శుభాకాంక్షలకు బొకేలు వద్దు

- కలెక్టర్ ఎం.హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేందుకు వచ్చేవారు పూల బొకేలు, శాలువాలకు స్వస్తి పలికి విద్యార్థులకు అవసరమైన నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఇస్తే బాగుంటుందని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరం 2025 సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు పూల బొకేలు, పుష్పగుచ్ఛాలు ఇవ్వడం సహజమైనప్పటికీ వాటికి బదులు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఇస్తే పేద విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.

సమగ్ర భూసర్వేనే పరిష్కార మార్గం



- ధరణి గందరగోళానికి సర్వేతోనే సరి
- కొత్త రెవెన్యూ రికార్డు తయారుచేయాలని నిపుణుల సూచన
- నిజాం పాలన తర్వాత సర్వే కరువు
- కాలానుగుణంగా మారిన భూ స్వరూపాలు
- ఆక్రమణలు చెక్‌పెట్టేలా సంస్కరిస్తేనే ఫలితం

గ్రామ రెవెన్యూ వ్యవస్థను వికేంద్రీకరించి పటిష్ఠమైన యంత్రాంగాన్ని, రికార్డులను తయారుచేయాలనే సూచనలు వెల్లువెత్తుతున్నాయి. నిజాం హయాంలో సుమారు 90 ఏళ్ల క్రితం నిర్వహించిన భూసర్వే తప్ప ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సర్వే నిర్వహించిన దాఖలాలు లేవు. కాలక్రమంలో భూస్వరూపాల్లో పలు మార్పులు జరగ్గా, తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని సమగ్ర భూసర్వే, కొత్తగా భూ హక్కుల రికార్డులు తయారుచేయాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వీఎల్‌వో (గ్రామ స్థాయి అధికారి) నియామకాలకు కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో భూసర్వే, కొత్త రికార్డులు, నక్షాలు, కొత్త పట్టాలు అందజేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

నిజాం హయాంలో 1920లో భూముల సమగ్రసర్వే నిర్వహించారు. అప్పటి పాలకులు, అధికారులైన జాగీర్దార్లు, జమీందార్లు, భూస్వాములకు అనుగుణంగా భూ హక్కులు రూపొందించారు. గ్రామ రెవెన్యూ నక్షాలు తయారు చేశారు. భూమిపై సాగుదారులకు హక్కులు కల్పించగా, ప్రభుత్వ భూములను రకరకాల పేర్లతో నమోదుచేశారు. ప్రతీ రెవెన్యూ గ్రామానికి నక్షా, టీపన్లు తయారు చేశారు. దేవాదాయ, ఇనామ్, అటవీ భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేశారు. అనంతరం ఇండియన్‌యూనియన్‌లో విలీనం తర్వాత ఖాస్రా, చౌఫస్లా రూపొందించారు. వాటి ఆధారంగా మొదటి ఆర్వోఆర్, రెండో ఆర్వోఆర్ రికార్డులు రూపొందాయి. భూసంస్కరణల తర్వాత మిగులు భూములు గుర్తించి సీలింగ్ పట్టాలు అందజేశారు. పేదలకు భూపంపిణీ చేసి అసైన్డ్ పట్టాలు అందజేశారు. రిజర్వ్‌ఫారెస్టు భూముల్లోనూ డీగ్రేడ్ ఫారెస్టుల్లో, ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయినవారికి పట్టాలు అందజేశారు. ఇళ్ల స్థలాలు ఇచ్చారు. దేవాదాయ, వక్ఫ్, ఇనామ్ భూముల్లోనూ పేదలకు పట్టాలిచ్చారు. అనంతరం ప్రాజెక్టులకు, కాల్వల నిర్మాణాలకు భూములను కేటాయించారు. ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు, రోడ్లు, రైల్వేలైన్ల నిర్మాణాలకు, పాఠశాలలకు, ఇతర ప్రభుత్వ, సామాజిక అవసరాలకు భూములకు కేటాయించారు. కానీ, వీటన్నింటికి సంబంధించి రెవెన్యూ రికార్డుల మార్పిడి సక్రమంగా జరగలేదు. దీంతో రికార్డులన్నీ తారుమారయ్యాయి. 90 ఏళ్ల క్రితం రూపొందించిన టీపన్లు, పహాణీలు, చౌఫస్ల రికార్డులు, నక్షాలు చెదలు పట్టాయి. కొన్ని చినిగిపోవడమే కాకుండా, కనిపించకుండా, గుర్తించలేని స్థితిలో...

- మిగతా 7వ పేజీలో...

జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో నిర్వహించిన ఐద్వా జిల్లా స్థాయి వర్క్ షాప్‌లో ఆమె మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధరలను నియంత్రించేందుకు పాలకులు తగిన చర్యలు తీసుకోవాలని, పేదవర్గాలకు నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా 14 రకాల వస్తువులు అందించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, కల్లూరి నాగమణి, మల్లేపల్లి లలిత, అండాలు, శారద, సోని, విజయలక్ష్మి, సువర్ణ, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

డీఈవో సత్యనారాయణ

గుండాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను జిల్లా విద్యాధికారి సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. పదో తరగతిలో ప్రతీ ఒక్క విద్యార్థి మంచి ఫలితాన్ని సాధించాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, బాలరాజు ఉన్నారు. అదే విధంగా మండలంలోని సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో సత్యనారాయణ

కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని తహసీల్దార్ జలకుమారి పంపిణీ చేశారు.

పాలడుగు సంఘానికి అండగా ఉంటాం



పాలడుగులో జర్మనీ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులను సన్మానిస్తున్న రైతు సంఘం అధ్యక్షుడు సైదులు, సభ్యులు

మోత్కూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో శ్రీమత్స్యగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘానికి అండగా ఉంటామని జర్మనీ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సంఘాన్ని వారు మంగళవారం పరిశీలించారు. ఇక్కడ సాగు చేస్తున్న పంటలు, సాగు విధానం, దిగుబడి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సంఘాలు రైతుల ఎదుగుదలకు ఎంతో తోడ్పడతాయన్నారు. పండించిన పంటలను మిల్లింగ్ చేసుకుని, ఆహార మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే మరింత లాభం ఆర్జించవచ్చని జర్మనీ బృందం ఈ సందర్భంగా సూచించింది. పాలడుగు రైతు సంఘానికి ముందు కూడా మదర్‌థెరిస్సా స్వచ్ఛంద సంస్థ ద్వారా అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో జర్మనీ బృందం సభ్యులు డాక్టర్ గ్లాజర్, థామస్, ఫ్రీస్, ఈవా, అనికా, డాక్టర్ జూలియన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సైదులు, మర్రిపెల్లి యాదయ్య, అంతటి నర్సయ్య, నర్సింహారెడ్డి, వెంకటయ్య, మచ్చగిరి, రాజు, కొనన ఉప్పలయ్య, అంజయ్య, మహేష్, సంఘం సీఈవో నర్సింహాచారి, పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ టెండర్ ప్రక్రియను నిలిపివేయాలి

రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌ను కోరిన నిర్వాసితులు

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అశాస్త్రీయంగా జరిగిన ట్రిపుల్‌ఆర్ ఉత్తరభాగం అలైన్‌మెంట్‌ను మార్చేందుకు టెండర్ ప్రక్రియను నిలిపి వేయించాలని బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌ను భూ నిర్వాసితులు కోరారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ లక్ష్మణ్‌ను చౌటుప్పల్‌కు చెందిన నిర్వాసితులు హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. న్యాయం చేసేంత వరకు పోరాటం సాగిస్తామని, అశాస్త్రీయంగా అలైన్‌మెంట్ చేసిన ట్రిపుల్‌ఆర్‌కు ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇచ్చే ప్రసక్తి లేదని వారు స్పష్టం చేశారు. ఆయన్ను కలిసిన వారిలో నిర్వాసితులు చింతల దామోదర్ రెడ్డి, డబ్బటి రామ్‌గౌడ్, జి.సురేందర్‌రెడ్డి, జాల వెంకటేశ్, సందగళ్ల మల్లేశం, భారతమ్మ, బుచ్చమ్మ, పార్వతమ్మ, దశరథ, జనార్ధన్‌రెడ్డి, ఉన్నారు.



రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌కు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్‌ఆర్ నిర్వాసితులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సుఖసంతోషాలతో పాటు భవిష్యత్ లక్ష్యాలను ప్రజలందరూ చేరుకోవాలని ఆకాంక్షించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలని ప్రజా ప్రతినిధులు కోరుకున్నారు.

మరింత సుఖ సంతోషాలతో ఉండాలి



నూతన సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు మరింత సుఖ సంతోషాలతో ఉండాలి. రాష్ట్రాలు, వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలకు కొత్త ఏడాది శుభాకాంక్షలు. ఈ సంవత్సరం ఎన్నో కొత్త ఆశలతో లక్ష్యాలను సాధించి సరికొత్త ఆలోచనలతో ముందుకు పోవాలి. నూతన వత్సర వేడుకలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలి.

గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్


కొత్త ఏడాది సుభిక్షంగా ఉండాలి



కొత్త ఏడాదిలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పాటుపడుతోంది. కొత్త ఏడాదిలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, కొత్త రేషన్‌కార్డుల మంజూరు చేస్తాం. ఉగాది నాటికి రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తాం. రెండు నెలల్లో హుజూర్‌నగర్ మోడల్ కాలనీ ఇళ్లు పేదలకు పంపిణీ చేస్తాం. రాష్ట్రంలోని ప్రధాన జలశయాలలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. సాగునీటికి ఎలాంటి ఢోకా లేదు. సాగర్ కాల్వలకు ఆధునీకరణ పనులు చేపడతాం. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి

న్యూఇయర్ శుభాకాంక్షలు



రాష్ట్రంలో నియంతపాలన పోయి తెలంగాణ ప్రజాపాలన వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రజలకు చీకటి తొలగి వెలుగు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ చేస్తాం. కొత్త ఏడాదిలో మరిన్ని సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడతాం. సరికొత్త లక్ష్యాలతో అన్నింట్లో విజయం సాధించాలి. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో జీవించాలి. 2024 ఏడాదికి వీడ్కోలు పలుకుతూ 2025 ఏడాదికి స్వాగతం పలుకుతూ ప్రజలందరికీ న్యూఇయర్ శుభాకాంక్షలు.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి



కొత్త ఏడాదిలో ప్రజలందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండాలి. కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి. ఒకరికొకరు మంచిని పంచుతూ ఐక్యతను పెంచుకుందాం. 2024 అంతా శూన్యమే. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలే మిగిల్చింది. 2025లోనైనా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగి అభివృద్ధికి అడుగులు పడాలని ఆశిస్తున్నాం. మార్పు, మార్పు అన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేర్లు మార్చడానికే పరిమితమైంది. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఒరిగిందేమీ లేదు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష. సూర్యాపేట అభివృద్ధికి నిధులు నిలిచాయి. ఐటీహబ్ అడ్రస్ మాయమైంది. హామీల ఊసే కరువైంది. ప్రజలంతా ఏకమయ్యే సమయం ఆసన్నమైంది. కొత్త ఏడాదిలోనైనా రాష్ట్ర పాలకులు అర్థంపర్థం లేని ఆరోపణలు మాని అభివృద్ధిపై దృష్టి పెడితే బాగుంటుంది.

గుంతకండ్ల జగదీ‌ష్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉండాలి



నూతన సంవత్సరంలో రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉండాలి. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందనున్నాయి. నూతన ఏడాదిలో ప్రజల సొంతింటి కల నెరవేరబోతోంది. అర్హులైన ప్రజలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సంక్షేమ పథకాలు చేరుతాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలి. రాష్ట్ర అభివృద్ధిలో నా వంతు బాధ్యతను నిర్వర్తిస్తా.

పటేల్ రమే‌ష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్

ఆరోగ్యంగా ఉంటూ అన్నిరంగాల్లో రాణించాలి



జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2025 సంవత్సరంలో ప్రజలు, యువత, ప్రతి ఒక్కరూ నూతన ప్రణాళికతో భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దుకునేలా ముందుకు సాగాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడంతో పాటు వారు రాణిస్తున్న రంగాల్లో మరింత ఉత్సాహంగా పనిచేస్తూ ఉన్నతంగా ఎదగాలి. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే ధ్యేయం. ప్రజలు, యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.

శరత్‌చంద్ర పవార్, ఎస్పీ, నల్లగొండ జిల్లా

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



కొత్త సంవత్సరం వేడుకలకు సర్వ సిద్ధం చేశాం. భక్తులకు మౌలిక వసతులు ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నాం. పాతా ఆచారాలు పునరుద్ధరణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. చంటిపిల్లల తల్లులు, దివ్యాంగులు, వృద్ధులకు నేటి నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక సమయం కేటాయించాం. భక్తుల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నాం.

భాస్కర్‌రావు, ఈవో , యాదగిరిగుట్ట దేవాలయం

ఆచరిస్తే... ఆనందం

"ముగిసిన సంవత్సరంలోని చేదు, తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూనే కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టేశాం. ప్రతీ ఏడాది జీవితంలో కొత్త మార్పులు తీసుకు రావాలని ఆశిస్తుంటాం. అలా చూస్తుండగానే గతేడాది పరుగులు తీస్తూ వెళ్లిపోయింది. అందులో మనం సాధించినవి, జీవితంలో మార్చుకున్నవి కొన్నే ఉండిఉండవచ్చు. మళ్లీ నూతన ఏడాదికి స్వాగతం పలికాం. ఈ శుభవేళ ప్రతి ఒక్కరూ ఒక సంకల్పంతో ముందుకు వెళ్లాలి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా ప్రతి ఒక్కరికీ తమ లక్ష్యాలు ఉంటాయి. వాటి సాధనతో పాటు ఆనందం, ఆరోగ్యకరమైన జీవితం కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోవాలి. ఒత్తిళ్లను అధిగమిస్తూ కొత్త ఏడాదిలో కొన్ని పద్ధతులను ఆచరిద్దాం. ప్రశాంతమైన, ఆనందదాయకమైన జీవితానికి బాటలు వేసుకుందాం."

● నూతన సంవత్సరంలో ప్రశాంత జీవితానికి బాటలు వేద్దాం

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

నూతన ఏడాదిలోకి ప్రవేశించే డిసెంబరు 31 రాత్రి ఏం చేయాలి? ఎలా సరదగా గడపాలి? అని దీర్ఘంగా ఆలోచించారు. రాత్రంతా 'హ్యాపీ న్యూఇయర్' అంటూ తిరిగారు. తెల్లవారుజామున ఎప్పుడో పడుకున్నారు. ఈ రోజు నుంచి ఏ కొత్త పద్ధతీ లేకుండా వచ్చే ఏడాది డిసెంబరు 31 వరకూ బతికేస్తే ఏంటీ ప్రయోజనం? ఈ రోజు కొత్తగా, ఏదైనా చేస్తేనే కదా జీవితానికి ఓ అర్థం.. పరమార్థం. జీవితంలో మరో ఏడాది గడిచి.. పోయింది. రూ.కోట్లు కుమ్మరించినా గడిచిన సమయంలో ఒక్కక్షణాన్ని కూడా వెనక్కి తేలేము. అందుకే ఉన్న సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న దానిపైనే దృష్టి సారించాలి.

సేవతో మానసిక ఆనందం

ఇతరులకు సహాయం చేయడంలో లభించే ఆనందం ఎంతో గొప్పది. మనకు ఉన్నదాంట్లో ఎంతో కొంత పేదవారికి, సమాజానికి సహాయం చేయాలి. చదువు, ఉద్యోగం, వ్యాపారం ఇలా మన విధులు మనం చేసుకుంటూనే ఖాళీ సమయాన్ని సేవ కోసం కేటాయించాలి. వ్యక్తిగతంగా ఒక్కరే చేయగలిగినా, ఒకవేళ చేయలేక పోతే పేద ప్రజలకు, సమాజం కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థల్లో వలంటరీగా చేరి సేవలు అందించవచ్చు. దీంతో సమాజంపై అవగాహన పెరిగి, సామాజిక సంబంధాలు బలపడుతాయి. సేవ చేయడం ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు మానసిక ఆనందాన్ని పొందుతారు.

నిద్రను విస్మరించవద్దు

చదువు, పని ధ్యాసలో పడి నిద్రను విస్మరించడం తగదు. మానసిక ఆరోగ్యానికి ఔషధం నిద్ర. మన శరీర అలసటను తీర్చడంతోపాటు, వివిధ రకాల హార్మోన్లు సక్రమంగా విడుదలయ్యేందుకు నిద్ర ఎంతో అవసరం. నిద్ర తగ్గితే మన భావావేశాలను నియంత్రించుకోవడం కష్టమవ్వడంతో పాటు మనం చేసే పనిలో ఏకాగ్రత, స్పష్టత లోపిస్తుంది. మనిషి రోజుకు కనీసం ఆరు నుంచి ఏడు గంటలు నిద్రవి ఉపశమనం లభిస్తుంది. మానసిక ప్రశాంతతకు అవకాశం ఉంటుంది. ఈ కొత్త సంవత్సరంలోనైనా నడక ప్రారంభించండి. ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండండి.



మద్యం మానుకుందాం..

స్నేహితులు, బంధువుల ప్రోద్బలంతో కుటుంబ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు కారణంగా అనేక మంది మద్యం బారిన పడుతున్నారు. మద్యపానం మనిషిలో వివేకాన్ని కోల్పోయేలా చేస్తుంది. ఆ మత్తులు ఏం చేస్తున్నామో తెలియదు. మద్యం తాగి వాహనాలు నడపడం, ప్రమాదాలు, మరణాలు, దాడుల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. అతి మద్యం ఆరోగ్యానికి హాని కలిగించడంతో పాటు అతి ఆందోళన, ఆతృత ఎక్కువై మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందుకోసం మద్యం అలవాటు ఉన్నవారు తమకో కుటుంబం ఉందనే విషయాన్ని గుర్తించుకోవాలి. మోతాదును తగ్గించుకుంటూ క్రమేపీ అలవాటును మానేందుకు ప్రయత్నించడం ఉత్తమం.

కొత్త అనుభూతులను పొందండి

జీవితం ఎప్పుడూ రోటీన్‌గా సాగిపోతుంటే.. మనం చేసే పనిలో ఆనందాన్ని పొందలేం. ఒక మూస ధోరణికి మనసు అలవాటు పడిపోతుంది. మనం ఏం పనిచేస్తున్నామో, దానికే అంకితమైపోతాం. జీవితంలో తిరిగి చూసుకుంటే ఏమీ ఉండదు. అందుకని మనసును ఉత్తేజపరిచి, నూతనోత్తేజంతో జీవితంలో ముందుకు వెళ్లేందుకు కొత్త అనుభూతులు అవసరం. మన అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా క్రీడలు, కళలు, సాహిత్యం, సాహసకృత్యాలు, సంగీతం, నృత్యం ఇలా విభిన్న కళల్లో ఉత్సాహంగా పాల్గొనడం, అలాంటివి ఎక్కడైనా జరిగితే తిలకించేందుకు వెళ్లడం లాంటివి చేయాలి. ప్రముఖులను కలుసుకోవడం, మాట్లాడడంతో కొత్త విషయాలు తెలుస్తాయి. ఆ సంఘటనలు కూడా మధురానుభూతిని అందించడంతో పాటు మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి.



సెలవులు ఎలా గడపాలో ఒక ప్రణాళిక పెట్టుకోండి

విహార యాత్రలు, పర్యాటక ప్రదేశాల సందర్శన, పుణ్యక్షేత్రాల దర్శనం, ప్రయాణాలు కొత్త ప్రవేశ సంవత్సరం మనసుకు ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లలు చదువుల్లో, మహిళలు ఇంటి బాధ్యతలు, ఉద్యోగం, పురుషులు ఉద్యోగం, వ్యాపారం ఇలా ఎవరికి వారు తమ పనుల్లో తీరిక లేకుండా గడుపుతుంటారు. అందరూ కలిసి సరదాగా గడిపే సమయం చాలా తక్కువ. అందరూ కలిసి ఆనందంగా గడిపేందుకు దొరికే సమయం సెలవులు. వారాంతపు సెలవైనా, ప్రత్యేక సెలవు దినమైనా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేందుకు ఒక ప్రణాళికను రూపొందించుకోవాలి. కొత్త వాతావరణంలో గడపడం, భార్యాపిల్లలు, తల్లిదండ్రులకు సమయం కేటాయించడం. ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సరదాగా గడిపే సమయం మంచి అనుభూతిని ఇస్తుంది. ఉరుకులు, పరుగుల జీవితంలో మనస్సుకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపుతుంది.


● రోజూ అరగంట నడిస్తే చాలు

ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ లోపిస్తున్న తరుణంలో కొత్త రుగ్మతలు మనిషిని నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రస్తుతం కొలువులన్నీ స్మార్ట్‌గా మారిపోవడంతో కుర్చీలకు అతుక్కుపోతున్నారు. దీంతో కనీస వ్యాయామం శరీరానికి అందకపోవడంతో ఊబకాయం, కీళ్లనొప్పులు, ఆయాసం వంటివి వస్తున్నాయి. వీటన్నింటికీ కేవలం ఓ అరగంట నడకతో ఫుల్‌స్టాప్ పెట్టొచ్చు. నిత్యం ఉదయాన్నే కనీసం అరగంట సమయం నడిస్తే చాలు. లేదంటే.. ఓ అరగంట యోగా, మెడిటేషన్ చేసినా ఫర్వాలేదు. దీంతో శరీరం లోపల ఆరోగ్యంతో పాటూ బయట ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. మానసిక ప్రశాంతతకు అవకాశం ఉంటుంది. ఈ కొత్త సంవత్సరంలోనైనా నడక ప్రారంభించండి. ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండండి.

ఈత, వ్యాయామం, సైక్లింగ్..

ఎక్కడైనా తక్కువ ఖర్చుతోనే మూడు వ్యాయామాలు చేసే అవకాశం ఉంది. ఇంటి దగ్గర నిత్యం వ్యాయామం చేయడం కుదరని వాళ్లు కాలనీవారితో ఓ జట్టుగా ఏర్పడి ఈతకు వెళ్లడం, లేదంటే సైక్లింగ్ చేస్తే మంచిది. వ్యాయామశాలలో చేరాలని ఏళ్లుగా అనుకుంటున్నా.. చేరని వాళ్లు ఇలా ఈ ఏడాది ఒక్కసారి చేరి చూడండి. అలవాటైతే మానాలన్నా.. మానలేరు.

ప్రతికూల ఆలోచనలను విడిచిపెట్టండి



మనసులో వివిధరకాల ఆలోచనలు వస్తుంటాయి. పరిస్థితిని బట్టి ఆ క్షణంలో అవి మనకు మంచిగా అనిపించవచ్చు. కానీ ఎదుటి వారికి చెడుగా కనిపిస్తుంది. ఆలోచనను ఆచరణలో పెట్టి, తర్వాత ఎందుకు చేశాం, అలా చేయకుండా ఉండాల్సిందని బాధపడుతుంటాం. మన ఆలోచనలు బట్టి మానసిక పరిస్థితి, ఆరోగ్యం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకని మన ఆలోచనలు, చేసిన పనులను ఒక కాగితంపై రాసుకుని చూసుకుని ఒక్క క్షణం ఆలోచిస్తే ఏది మంచిదో, ఏది మంచిది కాదో తెలుస్తుంది. మనలో ఉన్న ప్రతికూల ఆలోచనలను తొలగించి, చేసిన మంచి ఆలోచనలు, పనులకు స్వీయ అభినందన ద్వారా మనలోని మలినాలను పారదోలి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి.

బాధ, ఆందోళనను పంచుకోవాలి



మనలోని భావావేశాలను తోటివారితో పంచుకోవడం వల్ల భారం తగ్గినట్లు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. తోటివారి బాధను అర్థం చేసుకుని వారిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ప్రయత్నించాలి. ఆందోళన, ఆతృత, ఒత్తిడితో బాధపడేవాళ్లు వాటిని నియంత్రించుకునేందుకు, తగ్గించుకునేందుకు మానసిక ఆరోగ్య నిపుణులతో తమ భావాలను పంచుకోవడం మంచిది. మనలోని లోటుపాట్లను గుర్తించి తగిన కౌన్సెలింగ్ చేసి, ఒత్తిడిని అధిగమించడంలో తోడ్పడుతారు. ఒకరితో తమ భావాలను పంచుకోనంత వరకు గాలితో నిండిన బుడగలా ఉంటారు. ఇతరులతో పంచుకుంటే గాలి తీసేసిన బుడగలా ప్రశాంతంగా ఉంటారు.

కొత్త ఏడాదికి స్వాగతం



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలికి విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భువనగిరి పట్టణానికి చెందిన శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు 2025 ఆకారంలో కూర్చుని స్వాగతం పలికారు.

నూతన సంబురం



నల్లగొండ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆనందోత్సాహాల మధ్య విద్యార్థినులు సంబురాలు జరుపుకున్నారు.

దైనందినం..వికాసకోణం!

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

గత కాలపు జ్ఞాపకాలు గుండె లోతుల్లో నిత్యం ఉండాలంటే ఆ విశేషాలను ఎప్పటికప్పుడు భద్రపర్చుకోవడం చక్కని అలవాటు. ఇందు కోసం చాలామంది దైనందిని(డైరీ)ని అలవాటు చేసుకుంటారు. కొందరు డైరీని ఇష్టంగా రూపొందించుకుని నచ్చిన అంశాలను రోజువారీగా రాస్తుంటారు. జీవనయానంలో ఎదురైన వారితో తాము అనుభవించిన స్నేహచిహ్నాలు, ప్రేమగుర్తులు, అప్పుడప్పుడు వ్యథలు, కొన్నిసార్లు ఎవరికీ చెప్పుకోలేని గుండెగుప్పిట దాచిన రహస్యాలు కూడా ఇందులో నిక్షిప్తమవుతుంటాయి. జీవితాన్ని క్రమబద్ధంగా గడుపుకోవాలని ఆలోచించేవారు. తమకు ఎదురైన అన్ని రకాల అనుభవాలను ఎప్పటికీ మరిచిపోకూడదని అనుకునేవారు, జమాఖర్చుల వివరాలు అన్నీ తమ డైరీలో భద్రపరుచుకుంటారు. కాలగమనంలో డైరీ రూప విశేషాలల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. మొదట్లో ఒక చిన్న పుస్తకంలాగానో, కొన్ని కాగితాల బొత్తిలిగానో ఉండే డైరీ రానురాను రంగుల అట్టలను సంతరించుకుంది. లోపల ఆదాయపుపన్ను, రైలు మార్గాలను, ఆకాశయానం వివరాలు, బస్సు మార్గాలు, తపాలా వివరాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వశాఖలు, వ్యాపార వర్గాలు, ఉద్యోగులు, సంఘాలు వారీగా రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో చూడముచ్చటగానే కాక సమాచార దర్శినిలుగా కూడా ఇవి ఉపయోగపడుతున్నాయి.

డైరీ.. జ్ఞాపకాల పందిరి

శాలిగౌరారం : మన జీవితపు అడుగు జాడలను డైరీ పదిలపరుస్తోంది. గోడ మీద క్యాలెండర్ ప్రతి ఏడాది మారిపోతుంది. కానీ 365 రోజులు మనతోనే గడిపిన డైరీ ఏడాదిలోని ఆలోచన, అక్షరాలను మన్ముందు కొత్త ఏడాదికి ప్రోగ్రెస్ రిపోర్ట్ అవుతుంది. మనం పాత సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, సంకల్పాలు మరో సారి గుర్తు చేస్తుంటుంది.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం

మోత్కూరు: పాఠశాలలో విద్యార్థులకు హోంవర్క్ డైరీలు ఉపయోగపడుతుంటే కళాశాల విద్యార్థులు స్నేహితుల గురించి, స్ఫూర్తినిచ్చిన ఉపాధ్యాయుల గురించి రాసుకోవచ్చు. కళాశాలలో జరిగే సరదా సంఘటనలు రాసుకోవాలి. గత ఏడాది విఫలమైన అంశాలను రాసుకొని ఏడాది లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. యువతీ, యువకులు ప్రధానంగా తమ లక్ష్యాలు సాకరమైన కలలను డైరీలో రాసుకోవాలి. డైరీలను మన జీవన ప్రయాణానికి దిక్సూచిగా భావించి భద్రపరుచుకోవాలి.

కాలం చెల్లని ఈ-డైరీలు

నిడమనూరు: ఆధునికసాంకేతిక అవసరాలు పెరిగిన తర్వాత ఇంటర్నెట్‌లో లభించే ఈ-డైరీపై ఆసక్తి చూపుతున్నారు. ఎలాంటి వ్యయప్రయాసలకు ఇబ్బంది లేకుండా, సురక్షితంగా ఈ-డైరీ ఉపయోగపడుతుంది. పాత బడటం, చిరిగిపోయే సమస్యలు ఉండకపోవడంతో కంప్యూటర్, టాబ్లెట్లు స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించి ఈ-డైరీ రాసుకునే సదుపాయాన్ని ఉపయోగించుకుంటున్నారు. అంతేకాకుండా పాస్‌వర్డ్ ద్వారా మరొకరి డైరీని చదివే వీలు ఉండదు.

డైరీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే లాగా ఉండాలి. డైరీ రాయడానికి ప్రతిరోజూ ఒక నిర్దిష్టమైన సమయాన్ని ఏర్పాటు చేసుకోవడం మంచిది.

పనులు వాయిదా వేయడం తగ్గింది



డైరీ రాసే అలవాడు పాతికేళ్లుగా ఉంది. ఒకసారి చేసిన తప్పును మళ్లీ చేయకుండా సవరించుకునే వెసులుబాటు లభిస్తుంది. ఏరోజుకారోజు జరిగిన విశేషాలు, ముఖ్య విషయాలు నోట్ చేసుకుంటా. డైరీ రాయడం వల్ల జీవితం ప్రణాళికాబద్ధంగా ఉంటుంది. పనులు వాయిదా వేయకుండా ఏరోజు పనులు ఆరోజు చేసేలా డైరీ ఉపకరిస్తుంది. నేను పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నిర్వహించే కార్యక్రమాలను ఏ రోజుకారోజు డైరీలో నమోదు చేయడం నాకు అలవాటు. ఈ అలవాటును పిల్లలను సైతం నేర్పించడం మంచిది. ప్రతి ఏడాది జనవరి 1న డైరీ రాయడం ప్రారంభిస్తా.

గుర్రం ఇంద్రసేనారెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

హైస్కూల్ రోజు నుంచే డైరీ రాస్తున్నా



నేను హైస్కూల్‌లో చదివే సమయం నుంచే డైరీ రాస్తున్నాం. దీంతో భవిష్యత్తులో ఏం చేయాలన్న విషయంపై స్పష్టత వస్తుంది. ముందురోజు రాసిన విషయాలను ఒకసారి చూసుకుని లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తా. తీపి జ్ఞాపకాలు, చేదు సంఘటనలు కూడా నోట్ చేయడంవల్ల ఏడాది తర్వాత ఒకసారి తిరగేసి మననం చేసుకుంటా. రేపు జరగబోయే కార్యక్రమాలను ముందుగా రాసుకోవడం వల్ల సమయం కలిసి వస్తుంది.

సోమవరపు మహేశ్వర్, రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్ ఫర్ సోషల్ వెల్ఫేర్, నల్లగొండ

సాగు నీటి ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులుఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు.

మిర్యాలగూడ, దేవరకొండ, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగు నీటి ప్రాజె క్టులు త్వరగా పూర్తి చేయా లని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచిం చారు. మంగళ వారం నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గం లోని శ్రీశైలం సొరంగ మార్గం డిండి, ఎత్తిపోతల నక్కలగండి, పెండ్లిపాకల అధిక నిధులు కేటా యించి పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వం శ్రీశైలం సొరంగ మార్గానికి నిధులు కేటాయించ కుండా జాప్యం చేసింద న్నారు. అమెరికా నుంచి టన్నెల్ బేరింగ్ మిషన్ సముద్ర మార్గం ద్వారా బయల్దేరి నట్లు చెప్పారు. అలాగే డిండి ఎత్తి పోతల పెండ్లిపాకల ప్రాజెక్టు ఎత్తు పెంపు పనులను పూర్తి చేయాల న్నారు. దీంతో మంత్రుల స్పందించి అన్నీ ప్రాజెక్టులను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బీఎల్ఆర్, మందుల సామేల్, నీటి పారుదల శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్‌సీ అనిల్, సీఈ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్ఎస్పీ ఈఈ లక్ష్మణ్‌బాబుపై సస్పెన్షన్ వేటు!

మిర్యాలగూడ నియోజకవర్గంలో దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎత్తిపోతల పథకాల పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఇరిగేషన్ సీఈ అజయ్ మంత్రి దృష్టికి తెచ్చారు. స్థానికంగా ఉండకుండా హైదరాబాద్‌లో మకాం వేసినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకుఉన్నతాధికారులు ఈఈ లక్ష్మణ్‌బాబును సస్పెండ్ చేసినట్లు సమాచారం. కాగా ఈఈ లక్ష్మణ్‌బాబు ముక్కు సూటిగా వ్యవహరిస్తారని ఆ శాఖ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఈఈగా 14 ఏళ్ల సీనియార్టీ ఉందని వారం, పది రోజుల్లో ఎస్ఈగా పదోన్నతి పొందే జాబితాలో లక్ష్మణ్‌బాబు పేరు ఉన్నట్లు తెలుస్తోంది.

సమగ్ర భూసర్వేనే పరిష్కార మార్గం

(5వపేజీ తరువాయి)

ఉన్నాయి. నక్షాల్లో హద్దులు చెరిగిపోయాయి. సర్వేనెంబర్ రాళ్లు సైతం కనిపించని పరిస్థితి ఉంది.

పేదలు, నిర్వాసితులకు పట్టాల ముసుగులో భూముల ఆక్రమణ

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో 1970లో రిజర్వ్‌ఫారెస్టు భూమిలో డీగ్రేడ్ ఫారెస్ట్‌ను విడగొట్టి ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయి నిర్వాసితులకు పునరావాస కేంద్రాలు, భూములు అందజేయాలని నిర్ణయించారు. దీంతో పేదలకు, నిర్వాసితులకు డీఫారెస్ట్ పట్టాలు దక్కాయి. అయితే ఈ ముసుగులో రికార్డుల నిర్వహణ సరిగా లేక అవినీతికి పాల్పడడంతో పేదల, నిర్వాసితుల ముసుగులో అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించారు. ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ ముంపు నిర్వాసితులకు మేళ్లచెరువు, మఠంపల్లి, పాలకవీడు మండలాలతో పాటు దామరచర్ల, తిరుమలగిరి(సాగర్) మండలాల్లో అటవీభూముల్లో పట్టాలు, ఇళ్ల స్థలాలిచ్చారు. అయితే వీరితో పాటు అక్రమార్కులు సైతం అడ్డగోలుగా భూ ఆక్రమణలకు పాల్పడడంతో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురైంది. అంతేకాకుండా చెరువులు, కుంటలు, కందకాలు, డ్రైనేజీ కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయి. చివరకు శ్మశానవాటికల కోసం వినియోగిస్తున్న భూమి సైతం ఆక్రమణకు గురికావడం గమనార్హం.

ధరణితో మరింత గందరగోళం

గత బీఆర్ఎస్ హయాంలో భూరికార్డుల ప్రక్షాళన పేరుతో ధరణిని తీసుకురాగా, అక్రమాలు తొలగకపోగా, మరింత గందరగోళంగా రెవెన్యూ రికార్డులు మారాయి. భూములున్నవారికి పట్టాలు రాకపోతే, పట్టాలున్న వారికి భూములు లేని పరిస్థితి ఏర్పడింది. వేలాది మందికి భూమిలేకపోయినా భూహక్కు పత్రాలు వచ్చాయి. పేదలకు, సామాన్యులకు భూములున్నా వారి పేర్లు రికార్డుల్లో నమోదు కాలేదు. ఇలాంటి గందరగోళాన్ని నివారించేందుకే ప్రభుత్వ భూములు అత్యధికంగా ఉన్న తిరుమలగిరి(సాగర్) మండలంలో పూర్తిస్థాయి రెవెన్యూ సర్వేను పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం చేపట్టింది. ఇక్కడ సర్వే చేస్తున్న కొద్దీ పలు సమస్యలు వెలుగులోకి వస్తుండగా, వాటన్నింటినీ చట్టాలకు అనుగుణంగా, అవసరమైన సవరణలు చేపడుతూ వాస్తవికత, సామాన్యులు, పేదలకు ఇబ్బంది కలగకుండా రికార్డులు తయారు చేసి, సర్వే నిర్వహించారు.


రెవెన్యూ వ్యవస్థను మారుస్తున్నా పరిష్కారమవ్వని సమస్యలు

రాష్ట్రంలో 1984 నుంచి రెవెన్యూ వ్యవస్థలో సందర్భానుసారం మార్పులు చేస్తూ వచ్చినా సమస్యలు పరిష్కారమవకపోగా, ప్రతీ సందర్భంలో మరిన్ని కొత్త సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. తొలుత 1984లో పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు చేసి గ్రామ రెవెన్యూ అధికారులను నియమించారు. అనంతరం మళ్లీ గ్రామ రెవెన్యూ అధికారులను తొలగించి 1992లో గ్రామ పరిపాలనాధికారి వ్యవస్థను తెచ్చారు. తిరిగి 1996-97లో గ్రామ కార్యదర్శులను తీసుకువచ్చారు. 2004-05లో మళ్లీ వీఆర్వో వ్యవస్థను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 2022లో వీఆర్వో వ్యవస్థను రద్దుచేశారు. ఇప్పుడు మళ్లీ తాజాగా గ్రామపాలనాధికారి (వీఎల్‌వో) వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ 40 ఏళ్లలో పలు మార్పులు, సంస్కరణలు చేపట్టినా రెవెన్యూ వ్యవస్థలో క్షేత్రస్థాయిలో భూముల పరిరక్షణ కొరవడింది. దొంగ పట్టాలు, భూముల ఆక్రమణలు పరిపాటిగా మారిపోయాయి.

సమగ్రసర్వే చేయాలని సూచనలు

గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తున్న సందర్భంలో ప్రభుత్వం పాత అనుభవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సమగ్ర భూసర్వే నిర్వహించాలనే సూచనలు వస్తున్నాయి. భూసర్వేతో పాటు కొత్త నక్షాలు, కొత్త రెవెన్యూ రికార్డులు రాయాలనే అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. తిరుమలగిరి (సాగర్) తరహాలో ప్రైవేట్ సర్వేయర్లు కాకుండా ప్రభుత్వ సర్వేయర్లతో సమగ్రంగా భూముల సర్వే నిర్వహించి భూధార్ నెంబర్ లేక సర్వేనెంబర్లు కేటాయించాలని కోరుతున్నారు. కొత్త గ్రామ నక్షాలు, కొత్త రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ప్రభుత్వ భూములకు కంచెలు వేయాలని, ప్రభుత్వ ఆస్తులైన దేవాదాయ, వక్ఫ్, రిజర్వ్‌ఫారెస్టు భూములకు, చెరువులు, కుంటలు, గ్రామకంఠం భూములకు, శ్మశానవాటికలకు హద్దులు నిర్ణయించాలని కోరుతున్నారు. ప్రతీ గ్రామపంచాయతీని ఒక రెవెన్యూ గ్రామంగా గుర్తించి రికార్డులు, నక్షాలు రూపొందించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త రెవెన్యూ రికార్డు రాయాలి



నిజాం హయాం తర్వాత భూముల సర్వే జరగలేదు. రికార్డులన్నీ తారుమారయ్యాయి. ధరణి వచ్చాక పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పేదల, ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. నక్షాలు, టీపన్లు శిథిలమయ్యాయి. భూమిలేనివారికి పట్టాలిచ్చారు. వీటన్నింటినీ సరిచేసేందుకు సమగ్రభూసర్వే నిర్వహించి, కొత్త రెవెన్యూ రికార్డులు రాయాలి. ప్రతీ పంచాయతీని రెవెన్యూ గ్రామంగా గుర్తించి గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారిని నియమించాలి. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశా. గత సీఎం కేసీఆర్‌కు కూడా పలుసూచనలు చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా సమగ్రభూసర్వే నిర్వహించి, కొత్త రెవెన్యూ రికార్డు, నక్షాలు తయారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నా.

●సాముల శివారెడ్డి, సమితి మాజీ అధ్యక్షుడు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్

రైస్ మిల్లులో పడి మహిళకు తీవ్ర గాయాలు

పెన్‌పహాడ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైస్‌మిల్లులో పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని దూపాడు గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూపాడు గ్రామ శివారులో ఉన్న శ్రీరామ బిన్నీ రైస్ మిల్లులోకి అదే గ్రామానికి చెందిన గోపగాని దుర్గ దినసరి కూలీగా పనిచేస్తోంది. డిసెంబరు 28వ తేదీన దుర్గ కూలీకి వెళ్లి మిల్లులో పనిచేస్తుండగా ఆమె చున్నీ మిల్లు బెల్ట్‌లో చిక్కుకోవడంతో మిషన్ ఆమెను లోపలికి గుంజుకుంది. గమనించిన్న టెక్నీషియన్ మిల్లును ఆపాడు ఈ ఘటన దుర్గ తీవ్రంగా గాయపడగా ఆమెను 108 అంబులెన్సులో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పక్కటెముకలు విరిగడంతో డాక్టర్ల సూచన మేరకు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు దుర్గ భర్త గోపగాని రాములు మిల్లు యజమాని పత్తిపాక నాగరాజుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెన్‌పహాడ్ ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

రంగవల్లి స్మృతిలో ప్రజలను చైతన్యం చేయాలి

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క



భువనగిరిలో రంగవల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క.

భువనగిరి గంజ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : చదువుల తల్లి త్యాగాల కల్పవల్లి రంగవల్లి స్మృతిలో విజ్ఞాన కేంద్రాలు ప్రజలకు శాస్త్రీయ పరిజ్ఞానం పంచాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని పూలే అంబేద్కర్ విజ్ఞానం కేంద్రంలో రంగవల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక న్యాయం సాధించడంలో దళిత బహుజన శక్తులు కలిసికట్టుగా పయనించాలన్నారు. మాల, మాదిగలు వర్గీకరణను అంగీకరించి మాల మాదిగల మధ్య వైషమ్యాలు మానుకుని, అంటరానితనం, భూమి పంపిణీ వంటి ఉమ్మడి అంశాలపై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక కన్వీనర్ బట్టు రాంచంద్రయ్య, అరుణోదయ రాష్ట్ర కోశాధికారి భాస్కర్‌నాయక్, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురపంగ శివలింగం, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రాజేష్ నాయక్, మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు దాములూరి కృష్ణవేణి పాల్గొన్నారు.

నేటినుంచి హమాలీల సమ్మె

● గోదాముల్లో నిలిచిపోనున్న రేషన్ బియ్యం, ● సరుకుల సరఫరా గతంలో నిర్ణయించిన రేట్లు ఇవ్వాలని హమాలీల డిమాండ్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు దేవేందర్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హమాలీ కార్మికులు బుధవారం నుంచి సమ్మె చేయనున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు జరిగే ఒప్పందం మేరకు కూలి రేట్లకు సంబంధించి జీవో విడుదల చేయకపోవడంతో పాటు బడ్జెట్ కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సమ్మెలోకి దిగనున్నారు. ప్రస్తుతం ప్రతి బస్తా దిగుమతి చేసేందుకు బస్తాకు రూ.26చెల్లిస్తున్నారు. కొన్నినెలల క్రితం జరిగిన ఒప్పందం మేరకు రూ.29చెల్లిస్తామని ఒప్పందం జరిగింది. ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి గతంలో నిర్ణయించిన రేట్లు అమలు చేయకపోవడంతో సమ్మె చేయాలని హమాలీ కార్మికులు నిర్ణయించారు. దీంతో ప్రభుత్వ చౌక ధరల దుకాణాలకు సరఫరా అయ్యే రేషన్ సరుకులు, రేషన్ బియ్యం గోదాములోనే ఉండిపోనున్నాయి. నల్లగొండ జిల్లాలో మొత్తం ఎనిమిది గోదాములు ఉన్నాయి నల్లగొండ నకిరేకల్, చండూరు, నాంపల్లి, దేవరకొండ, నిడమనూరు పెద్దవూర, మిర్యాలగూడలోని గోదాముల్లో 200మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారు. సంక్రాంతి పండగకు ముందు హమాలీ కార్మికుల సమ్మెలోకి దిగుతుండడంతో రేషన్ సరుకుల సరఫరా ఆగిపోనుంది.

ప్రతి నెలా 7వేల టన్నుల బియ్యం సరఫరా

జిల్లాలోని మొత్తం 800చౌక ధరల దుకాణాలకు ప్రతి నెలా ఏడు వేల మెట్రిక్ టన్నుల బియ్యం బియ్యం సరఫరా అవుతుంది. సీవిల్ సప్లయ్ శాఖ డీఎం ఆధ్వర్యంలో ఈ బియ్యం సరఫరాను చౌక ధరలదుకాణాలకు చేరవేస్తారు. అయితే హమాలీ కార్మికులు సమ్మెలోకి దిగుతుండడంతో రేషన్ సరఫరా నిలిచిపోనుంది. అయితే హమాలీ కార్మికులు కొద్దిరోజుల క్రితం హైదరాబాదులో పలుమార్లు ధర్నా కూడా చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవో విడుదల కాకపోవడంతో సమ్మె అనివార్యమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, హమాలీ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి తెలిపారు.

హమాలీ కార్మికుల ధర్నా

నల్లగొండ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఒప్పందం ప్రకారం జీఓను విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ హమాలీ కార్మికులు నల్లగొండలోని సివిల్ సప్లయ్ గోదాం పాయింట్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల ఇచ్చిన మాట ప్రకారం అమలు చేయకపోవడం వల్ల సమ్మె అనివార్యమైందని తెలిపారు. తక్షణమే జీవ విడుదల చేసి సమ్మెను నివారించి కార్మికులకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు దొనకొండ వెంకటేశ్వర్లు. బుచ్చయ్య జానయ్య, సైదులు శ్రీను సోమయ్య ఎల్లయ్య లింగస్వామి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

32క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

●ఎనిమిది మందిపై కేసు

చిలుకూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిల్వ ఉంచిన 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన చిట్టిప్రోలు సీతాపతి ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సోమవారం రాత్రి తరలిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేసరికి మినీ ట్రావెల్ బస్సు, స్కార్పియో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలించేందుకు లోడ్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన కందుకూరి కోటయ్య, కందుకూరి శ్రీను, చెడపంగు వెంకటేశ్వర్లుతో పాటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కుంభం కోటేశ్వరరావు, పాలపతి వెంకటేశ్వరరావు, చెవుల శ్రీను, వెంకట నాగేశ్వరరావు, తాతిరెడ్డి అంజితరెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. 64 బస్తాల్లో తరలిస్తున్న 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోదాడ సివిల్ సప్లై అధికారి రాంరెడ్డి ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై క్రిమినల్ కేసులతో పాటు 6-ఏ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

ఫణిగిరి బౌద్ధ శిల్పాలు అద్భుతం

● విదేశీ బౌద్ధ పరిశోధకులు



విదేశీ ప్రొఫెసర్లకు బౌద్ధ కళాఖండాలను వివరిస్తున్న ఈమని నాగిరెడ్డి

నాగారం, డిసెంబరు 31: రెండు వేల ఏళ్ల నాటి ఫణిగిరి బౌద్ధశిల్పాలు, కళాఖండాలు అద్భుతంగా ఉన్నాయని విదేశీ బౌద్ధ పరిశోధకులు అన్నారు. మంగళవారం ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో, బుద్ధవనం కన్సల్టెంట్ ఈమని శివనాగిరెడ్డితో కలిసి విదేశీ బౌద్ధ పరిశోధకులు సందర్శించారు. ఫణిగిరి కొండలపై ఉన్న బౌద్ధారామాన్ని న్యూజిలాండ్‌కు చెందిన ప్రొఫెసర్ సారా, ఆస్ట్రేలియాకు చెందిన ప్రొఫెసర్ జాఫ్రీషా సందర్శించారు. స్థూపం, చైత్య గృహాలు, శిలామండపాలు, విహారాలు, మ్యూజియంలోని సిద్దార్థుని జననం, మహాభినిష్కమణం, బుద్ధుని శిల్పాల గురించి ప్రొఫెసర్లకు ఈమని శివనాగిరెడ్డి వివరించారు. క్రీ.పూర్వం ఒకటో శతాబ్దం నుంచి క్రీ.శ నాలుగో శతాబ్దం వరకు ఫణిగిరి బౌద్ధ క్షేత్రంగా విలసిల్లిందని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు నర్సింహారావు, సిబ్బంది వీరయ్య, యాకయ్య పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో జాతీయ స్థాయికి ఎంపిక



చందన



నవదీప్

బొమ్మలరామారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -17 సాఫ్ట్‌బాల్ క్రీడల్లో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గజ్వేల్లి నవదీప్, జాగిల్లాపురం చందన మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ ర్యాకల వీరేశం తెలిపారు. ఈ విద్యార్థులను హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

జూడోలో మోత్కూరు విద్యార్థినికి రజిత పతకం



విద్యార్థిని సాక్షికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, కోచ్ వెంకట్

మోత్కూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్లో డిసెంబరు 28, 29 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ జూడో పోటీల్లో మోత్కూరు సాయి చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.సాక్షి సబ్ జూనియర్ 52కిలోల విభాగంలో రజత పతకం సాధించింది. కరాటే, జూడో కోచ్ అన్నెపు వెంకట్, పాఠశాల ప్రిన్సిపాల్ బి.రవీందర్‌రెడ్డి ఆమెకు పతకం, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

ఏడాదిలో రూ.1238 కోట్లతో అభివృద్ధి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గత ఏడాదిలో నకిరేకల్ నియోజకవర్గంలో రూ.1238కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపాలన ఏడాదిపూర్తి చేసుకున్న నేపథ్యంలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ రజితలతో కలిసి నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ మంగళవారం మీడియాతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వం చేపట్టి వదిలేసిన పనులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ప్రజాపాలనలో కొత్త అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం గడీల పాలన సాగిస్తూ రూ.7లక్షలకోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని బీఆర్ఎస్ కొల్లగొట్టిందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలల ప్రాజెక్టుగా ఉన్న బ్రాహ్మణవెల్లెంలకు రూ.500ల కోట్లు ఖర్చుచేస్తే పూర్తయ్యేదని, ప్రాజెక్టు పూర్తి చేస్తే నాటి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పేరు వస్తుందని దానిని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు మూలకు పడేసిందన్నారు. రూ.2వేల కోట్ల ఖర్చులతో పూర్తయ్యే ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులనూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలను సైతం నాటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమైన తొలి ఏడాదిలోనే బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుకు రూ.30కోట్లు, ధర్మారెడ్డికాల్వకు రూ.129కోట్లు, పిల్లాయిపల్లి కాల్వకు రూ.90కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. రూ.103కోట్ల వ్యయంతో నియోజకవర్గ వ్యాప్తిగా ఆర్అండ్‌బీ రోడ్లు, రూ.53కోట్లతో పంచాయితీరాజ్ రోడ్లు నిర్మించామన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.368కోట్ల రైతుల రుణమాఫీ జరిగిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్లు ఎస్‌కే. లతీఫ్, బయ్య ముత్తయ్య, పి. శంభయ్య, కోమటిరెడ్డి చిన వెంకటరెడ్డి, కోట మల్లికార్జునరావు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



చండూరు రూరల్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామానికి చెందిన కోల మల్లమ్మ(110) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. మల్లమ్మకు పిల్లలు లేకపోవడంతో ఓ కుమారుడిని దత్తత తీసుకుని సాదుకుంది. ఆయన కూడా 15సంవత్సరాల క్రితం మృతిచెందాడు. ప్రస్తుతం ఆమె కోడలు, మనమళ్ళు, మునిమనుల్లు, మనమరాళ్లు ఉన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం మల్లమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

చిట్యాలరూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మెదక్ జిల్లా కంగ్టీ మండలం డేగులవాడీకి చెందిన యువకుడు రాథోడ్ సుర్జీకుమార్(28) పెద్దకాపర్తి చెరువు సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్సపొందుతూ ఒకరు ..

ఆటో బోల్తా పడిన సంఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కె. అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం... గత ఏడాది డిసెంబరు 27న చిట్యాల మండలం ఎలికట్టెకు చెందిన ఉప్పలపల్లి ముత్యాలు(49), తన కూతురు కావేరితో కలిసి అదే గ్రామానికి చెందిన ఇస్కిళ్ళ నాగరాజుకు చెందిన ఆటోలో చిట్యాలకు బయలుదేరారు. ఆటో గ్రామశివారులోకి రాగానే ఆటో ప్రమాదవశాత్తు పల్టీకొట్టింది. ఈ ఘటనలో ముత్యాలు, ఆయన కూతురు కావేరికి గాయాలయ్యాయి. ముత్యాలు చికిత్సపొందుతూ నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఇంటిపై తెగిపడిన 11కేవీ విద్యుత్ లైన్ తీగలు



తెగిన స్తంభం కరెంట్ తీగ

తిప్పర్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రం నూకల వాగూడెంలో 11కేవీ విద్యుత్ లైన్ తీగలు మంగళవారం ఓ ఇంటిపై తెగిపడ్డాయి. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి గడ్డికొండారం వైపునకు వెళ్తున్న విద్యుత్ 11 కేవీ తీగలు గ్రామంలోని పలువురి ఇళ్లపై నుంచి వెళ్తుంది. మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా తీగ తెగి వడ్డెపల్లి జానయ్య అనే వ్యక్తి ఇంటిపై పడితీగ కిందికి జారింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని బాధితులు తెలిపారు.

డీఈఈసెట్ కౌన్సిలింగ్‌కు షెడ్యూల్ విడుదల

నల్లగొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డీఈఈసెట్ -2024లో ర్యాంకు సాధించి వెబ్ ఆప్షన్ నమోదు చేసుకున్న అభ్యర్థులు, ఆప్షన్ నమోదు చేసుకున్న సీటు రాని అభ్యర్థుల కోసం డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగిలిన, రిపోర్టు చేయని వారి కోసం షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రధానచార్యులు కానుగుల నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని 9వ తేదీన మెరిట్, రోస్టర్ ప్రకారం సీట్లను కేటాయిస్తామని తెలిపారు. 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఫీపేమెంట్, అడ్మిషన్ల కేటాయింపు, కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంద తెలిపారు. అడ్మిషన్ కేటాయింపు అనంతరం కళాశాలల్లో రిపోర్టింగ్‌కు చివరి రోజు ఈనెల 16వ తేదీ అని తెలిపారు.

కొత్త సంవత్సరంపై కొంగొత్త ఆశలు

- 2025లోనైనా ఇక్కట్లు తీరేనా..
- జిల్లా ప్రజల ఆశావహ దృక్పథం

భువనగిరి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వ్యవస్థల పరంగా భువనగిరి పట్టణానికి గుర్తింపు లభిస్తున్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనకంజలోనే ఉంటోంది. ఫలితంగా నాటి నుంచి నేటి వరకు ప్రజలకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. ఈ నేపథ్యంలో 2025 సంవత్సరంలోనైన ప్రజాప్రతినిధులు, అధికారులు మా సమస్యలను తీరుస్తారని, పట్టణాభివృద్ధికి కృషి చేస్తారని 70వేల మంది ప్రజలు ఆశిస్తున్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌లో గృహప్రవేశాల కోసం

స్థానిక సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల 444 మంది లబ్ధిదారులను లాటరీ విధానంలో ఏడాదిన్నర క్రితం ఎంపిక చేసి పట్టాలు అందజేశారు. కానీ నివాసయోగ్యం లేని ఆ ఇళ్లలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కోసం అప్పట్లోనే రూ.4.50 కోట్లతో ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రభుత్వానికి అధికారులు నివేదిక అందజేశారు. కానీ రాష్ట్రంలో ప్రభుత్వాలు, స్థానిక ప్రజాప్రతినిధులు మారినప్పటికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనుల పురోగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగలిలా అక్కడే ఉండటంతో లబ్ధిదారులు అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారు. కానీ ఈ సంవత్సరమైనా సొంతింటి కల నెరవేరాలని తాము నమ్మే దేవుళ్లను మొక్కుకుంటున్నారు.

100 ఫీట్ల రహదారి విస్తరణ పనులు కొలిక్కి వచ్చేనా?

పట్టణ ప్రధాన రహదారి విస్తరణ పనులకు సుమారు పది సంవత్సరాల క్రితం అప్పటి కేసీఆర్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు రూ.24కోట్ల వ్యయంతో ఐదేళ్ల నుంచి దశలవారీగా పనులు నడుస్తూనే ఉన్నాయి. చివరాకరికి చేరిన పనుల్లో విద్యుత్ టవర్ల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఇంకా ఆధునిక వీధి దీపాలు, వాకింగ్ పాత్‌పై టైల్స్, ఆక్రమణల తొలగింపు, ట్రాఫిక్ సిగ్నల్స్ పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉన్నది.


భువనగిరి పట్టణం ముఖ చిత్రం

ప్రయాణ కష్టాలు తీరేనా?

భువనగిరి పట్టణం గుండా అన్ని దూర ప్రాంతాలకు బస్సులు, రైళ్లు వెళుతుంటాయి. కానీ ఇక్కడ మాత్రం ఆగవు. దీంతో ఆగకుండానే వెళుతున్న బస్సులను, రైళ్లను చూస్తూ తృప్తి పడాల్సిన పరిస్థితి స్థానికులది. కానీ కొంతకాలంగా జిల్లా కేంద్రం భువనగిరి నుంచి జిల్లా అంతటా అన్ని మార్గాల్లో సరిపడా ఆర్టీసీ బస్సులు నడుపుతామని, ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతి సహా అన్ని ప్రాంతాలకు వెళ్లే రైళ్లు భువనగిరిలో త్వరలో ఆగనున్నాయని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలు నెరవేరి 2025 సంవత్సరం నుంచి అయినా ప్రయాణ కష్టాలు తీరుతాయని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం

భువనగిరి పట్టణ జనాభా సుమారు 70 వేలు ఇందిరమ్మ ఇండ్ల పథకంపై ప్రభుత్వం ఇచ్చిన హామీతో సుమారు 9వేల మంది ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులు గుర్తింపు సర్వే సాగుతోంది. పథకం మొదటి దఫాలో నియోజకవర్గ 3500 మందికి లబ్ధి చేకూరుస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పట్టణంలోని అర్హులైన నిరుపేదలు ప్రభుత్వం ఇచ్చే రూ. 5లక్షలకు మరిన్ని సొంత పైసలకు జోడించి సొంతింటిని కట్టుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

క్రీడాకారులు, విద్యార్థుల ఆశలు

జిల్లా కేంద్రంగా ఉన్న భువనగిరిలో క్రీడలకు, వాకర్స్‌కు ఏకైక దిక్కు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ మాత్రమే. కానీ సంరక్షణ చర్యలు లేకపోవడంతో అసౌకర్యాల నడమే క్రీడాకారులు, వాకర్స్ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఇండోర్ స్టేడియం ఉన్నప్పటికీ క్రీడ వసతులు లేకపోవడం, ప్రహరీ నిర్మించక పోవడంతో ఆక్రమణలకు గురివుతోంది.


భువనగిరిలో ఓ షాపులో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

అలాగే నూతన ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో పట్టణ శివారులో 10 ఎకరాల్లో రూ. 100 కోట్లతో మల్టీపర్పస్ స్టేడియం నిర్మించనున్నట్టు పాలకులు ఇచ్చిన హామీ నూతన సంవత్సరంలో నైనా నెరవేరాలని క్రీడాకారులు ఆశిస్తున్నారు.

మెరుగైన వైద్య సేవల కోసం

ఇటీవలి వరకు భువనరిరి జిల్లా ఆస్పత్రిని నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలకు బోధన ఆస్పత్రిగా మార్పు చేశారు. దీంతో గతంతో పోలిస్తే పలువురు స్పెషలిస్ట్ వైద్యులు, పలు నూతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.200 కోట్లతో రెండవ అంతస్తు నిర్మాణం పనులు సాగుతున్నాయి. టీ-హబ్‌లో త్వరలోనే సిటీస్కాన్ సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. అయిప్పటికీ గర్భిణీలకు కడుపు కోత, ప్రైవేట్ లేదా హైదరాబాద్ ఆస్పత్రిలకు రెఫరల్ తప్పడం లేదు. ట్రాన్స్‌జెండర్లకు మైత్రి క్లీనిక్ కూడా ప్రారంభంమైంది. ఈ మేరకు బోధన్ ఆస్పత్రిలో రోగులకు పూర్తిస్థాయి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని అధికారులు, ప్రతినిధులు ఇస్తున్న హామీలు నెరవేరి తమపై ఫీజుల రూపేనా ఆర్థిక భారం తప్పుతుందని ఆశాభావంతో ఉన్నారు.

నేటి నుంచి ప్రారంభం కానున్న ఆంగ్ల నూతన సంవత్సరంపై భువనగిరి పట్టణవాసులు కోటి ఆశలు పెట్టుకున్నారు. జిల్లాల పునర్విభజనతో ఏడు సంవత్సరాల క్రితం జిల్లా కేంద్రం ఆవిర్భవించింది. అభివృద్ధి పనులు సాగుతున్నప్పటికీ ఇంకా కొన్ని అభివృద్ధి పనులు పెండింగులోనే ఉన్నాయి. అభివృద్ధి పనులన్నీ కొత్త సంవత్సరం తొలి నాళ్లలోనే పూర్తికావాలని భువనగిరి పట్టణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

మౌలిక సదుపాయాల ఇక్కట్లపై


ఉమ్మడి జిల్లాలోనే సీనియర్ మునిసిపాలిటీగా ఉన్న భువనగిరిలో అంతే స్థాయిలో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. 35వార్డులతో కూడిన పట్టణంలో పలు బస్తీలలో సీసీ, బీటీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారు. రికార్డుల ప్రకారం పదుల సంఖ్యలో పార్కులు ఉండగా మరిన్ని నూతన పార్కులకు ప్ర తిపాదనలు ఉన్నాయి. కొన్ని పనులకు అనుమతులు, టెండర్లు జరిగినప్పటికీ స్పష్టత కొరవడింది. మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధి పరిచే లక్ష్యంతో చెరువు కట్టపై సుమారు రూ. 7 కోట్ల వ్యయంతో ఏడాదిన్నర క్రితం చేపట్టిన పనులు నేటికీ నత్తనడకను మరిపిస్తున్నాయి. అలాగే వెల్లువలా సాగుతున్న అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలతో రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. దీంతో నూతన సంవత్సరంలోనైనా అభివృద్ధి పనుల పూర్తి, ఆక్రమణ నియంత్రణతో పట్టణం న్యూ లుక్‌ను సంతరించుకుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వినియోగంలోకి వచ్చేనా?

పట్టణవాసులకు గృహస్తు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగు పరిచే లక్ష్యంతో సుమాంరు రూ.7కోట్ల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ ఏడాదిన్నర క్రితం అసంపూర్తిగా నిలిచిపోయాయి. సుమారు 90శాతం పూర్తిగా మిగులు పనుల పూర్తి కోసం మరో కోటి రూపాయలు అవసరమైతాయని అధికారులు అంచనా వేశారు. కానీ అప్పటినుంచి ఆ కోటి రూపాయల కేటాయింపు లేకపోవడంతో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన మార్కెట్ ఏడాదిన్నర నిరుమపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం మార్కెట్ ను పరిశీలించి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మూడు నెలల్లో పనులు పూర్చిచేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా మునిసిపల్ జనరల్ ఫండ్ నుంచి కోటి రూపాయల కేటాయింపునకు మునిసిపల్ కౌన్సిల్ నెల క్రితం ఆమోదం తెలిపింది. దీంతో పనుల పూర్తిపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

ఖిల్లా అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు అయినా..

కేంద్ర ప్రభుత్వ స్వదేశీదర్శన్ పథకానికి చారిత్రాత్మక భువనగిరి జిల్లా ఎంపికయింది. చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం రూ.100 కోట్లు మంజూరు అయ్యాయి. చేపట్టాల్సిన పనుల డీపీఆర్ పూర్తయింది. రోప్‌వే నిర్మాణానికి 2.37 ఎకరాల ప్రైవేట్ భూమి ఇవ్వడానికి రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ సేకరించడంలో అధికారులు చేస్తున్న జాప్యంతో పనులకు ఆటంకంగా మారుతోంది. దీంతో ఖిల్లా అభివృద్ధి పనులపై పర్యాటక ప్రేమికుల్లో పలు సందేహాలు తలెత్తుతున్నాయి. భూసేకరణ, టెండర్ ప్రక్రియ పూర్తిచేసి నూతన సంవత్సరంలోనైనా ఖిల్లా అభివృద్ధి పనులు ప్రారంభించాలని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


భువనగిరి ఖిల్లా

సమాచారం

8 నుంచి సంస్థాన్ ప్రీమియర్ లీగ్ సీజన్-4 ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహించే సంస్థాన్ నారాయణపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జనవరి 8వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల నాగరాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో క్రీడల వివరాలను ఆయన వివరించారు. సీజన్-4 లీగ్ షెడ్యూల్‌ను 7వ తేదిన డ్రా తీయనున్నట్లు తెలిపారు. 8న ఎస్ఎన్‌పీఎల్ సీజన్-4 ప్రారంభం అవుతుందన్నారు. దీనికి సంబంధించి జనవరి ఒకటి నుంచి మండలంలోని అన్ని క్రికెట్ టీమ్‌ల ఎంట్రీలను తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు కొండ శ్రీకాంత్ గౌడ్, కొప్పు రామకృష్ణ, మిరియాల శ్రీహరి, కొండ నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

వరి సాగులో మెళకువలు పాటించాలి

యాదగిరిగుట్ట రూరల్ 31(ఆంధ్రజ్యోతి): యాసంగి సాగులో మెళకువలు పాటించి వరి సాగు చేయాలని జిల్లా వ్యవసాధికారి గోపాల్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని రామాజీపేటలో పంటల పరిశీలనలో భాగంగా ఆయన వరి, కంది పంటలను పరిశీలించి మాట్లాడారు. నాటు పెట్టిన వరి పొలాల్లో తక్కువ మొత్తంలో నీరు ఉండేలా చూసుకోవాలని, తక్కువ మోతాదులో ఎరువులు వాడాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ

తుర్కపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోరెడ్డి సంజీవరెడ్డి అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సంజీవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో సీఎం సీపీఆర్‌వో బోరెడ్డి అయోధ్యరెడ్డి, పడాల శ్రీనివాస్, భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, సింగిరెడ్డి నర్సింహరెడ్డి, బోరెడ్డి రాంరెడ్డి, పిస్నెపురెడ్డి నరేందర్‌రెడ్డి ఉన్నారు.

పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్లక్ష్యం చేయొద్దు


భువనగిరి రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతీ నెలా చివరి రోజున నిర్వహించే పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బర్రె సుదర్శన్ అన్నారు. మంగళవారం భువనగిరి మండలం బస్వాపురం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు బడుగు వర్గాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కోట్ల కల్యాణ్, రూరల్ ఎస్‌హెచ్‌వో వి సంతోష్‌కుమార్, ఆర్ఐ జక్కుల భద్రయ్య, ఏఎస్ డబ్ల్యూవో వసంత కుమారి, కొడారి వెంకటేశ్, రమాదేవి, ఆనంద్, అన్నంపట్ల కృష్ణ, పల్లెర్ల వెంకటేశ్, రాసాల వీరయ్య, పోచయ్య పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ


అయ్యప్పస్వామి మహా పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్యగౌడ్

ఆలేరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణానికి చెందిన అయ్యప్ప మాలధారులు గురుస్వాములు దూడల యాదగిరి, సీస ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో హరిహరపుత్ర అయ్యప్పస్వామికి మంగళవారం మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారి నివాస సన్నిధానంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్ హాజరయ్యారు. మాలధారులకు బిక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శంకరయ్య, కౌన్సిలర్ బేతి రాములు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, నాయకులు పత్తి వెంకటేష్, సీసా రాజేష్, రామకృష్ణ, మధుకుమార్, ఉప్పలయ్య, బాలరాజు, బన్ని, ఫయాజ్, పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?: సీపీఎం



దీక్షలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. భువనగిరి శివారులోని ప్రభుత్వ ఐటీఐ సమీపంలో జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈసందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ రామకిష్టాపురం, పెంచికల్ పహడ్ గ్రామాలతో పాటు సుమారు 40గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్న ఈ ప్రాంతంలో అండర్‌పాస్ నిర్మాణం చేపట్టకపోవడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అండర్ పాస్ నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. అఖిలపక్ష నాయకులు కొలుపుల అమరేందర్, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, కొండమడుగు నర్సింహ, జనగాం పాండు, బట్టు రామచంద్రయ్య, దాసరి పాండు, పల్లెర్ల అంజయ్య, మాటూరి బాలరాజు, కొలుపుల వివేకానంద, దయ్యాల నర్సింహ, ఎనబోయిన ఆంజనేయులు, యశీల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ డిమాండ్ చేశారు. తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరుకుంది. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని మంగళవారం జహంగీర్ సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. దీర్ఘకాలంగా విద్యాశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు శాంతియుతంగా పోరాటం చేస్తూ హక్కులను సాధించుకోవాలని సూచించారు. పోరాటానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరాజు, నాయకులు భాస్కర్, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఆత్మకూరు(ఎం) డిసెంబర్ 31:(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం నాణ్యతను పాటించాలని డీఆర్‌డీవో టి.నాగిరెడ్డి వంట ఏజెన్సీలను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పల్లెర్ల హైస్కూల్‌లో మాధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. క్లాస్‌రూమ్ లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలో నర్సరీ లో చేపడుతున్న మొక్కలపెంపకాన్ని పరిశీలించారు. తహసీల్దార్ వి.రవికుమార్ ఆత్మకూరు, పల్లెపహడ్ ఉన్నత పాఠశాలలు, డిప్యూటి తహసీల్దార్ సఫీయెద్దీన్ కొరటికల్ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఏపీవో బి.రమేష్ పాల్గొన్నారు.

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి గుర్రం సురేష్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి నర్సింహ, కారోబార్ స్వామిగౌడ్ ఉన్నారు.

మోత్కూరు : మండలంలోని కొండగడప ప్రాథమికోన్నత పాఠశాలలో నీటి పారుదల శాఖ జిల్లా అధికారి ఇ.నర్సింహ మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో జితేందర్‌రెడ్డి పరిశీలించారు. టేకులసోమారం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, సంగెం పాఠశాలలో ఎంపీవో కేదారీశ్వర్ పరిశీలించారు.

అడ్డగూడూరు: మండలంలోని చౌళ్లరామారం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను మండల ప్రతేకృధికారి కృష్ణయ్య పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ, విద్యకమిటీ చైర్మన్ దొంతోజు స్వప్న పాల్గొన్నారు.

రాజాపేట: రఘునాథ్‌పూర్ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్, గ్రామకార్యదర్శి పవన్ పాల్గొన్నారు.


పల్లెర్ల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో నాగిరెడ్డి

ప్రజా సంక్షేమమే.. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామం చెరువుకట్ట వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో కారు చెరువులో బోల్తా పడి ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటన స్థలాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 20లక్షలతో త్వరలో ప్రమాద నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి తక్షణమే రూ.20లక్షల నిధులు మంజూరు చేయించానని అన్నారు. అనంతరం మండల పరిధిలోని జిబ్లక్‌పల్లి, దంతూరు, రేవణపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు తడక వెంకటేష్, సామ మధుసూదన్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొట్టం కరుణాకర్‌రెడ్డి, మండల నాయకులు గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, అంబరీష్‌రెడ్డి, పడమటి భూపాల్‌రెడ్డి, పక్కీరు మల్లారెడ్డి, మన్నెం వెంకట్‌రెడ్డి, పక్కీరు నర్సిరెడ్డి, ఉప్పునూతల వెంకటేష్, పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లాలయ్య, అంజిరెడ్డి, దానయ్య, మాజీ సర్పంచులు బొడిగె శంకరయ్య, లింగస్వామి, జింకల కుమార్, రుద్ర చంద్రప్రకాష్, నక్క శ్రీనివాస్‌రెడ్డి యువజన కాంగ్రెస్ నాయకులు గనిగంటి వెంకటేష్‌గౌడ్, కుక్క కుమార్, కీర్తి సంజీవ, ఎజాస్, గ్యార సందీప్, గణేష్ పాల్గొన్నారు.


జలాల్‌పూర్ చెరువుకట్ట మూలమలుపు ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

నూతన వేడుకలకు ఆలయం ముస్తాబు

భువనగిరి అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో కొత్త సంవత్సరం వేడుకలకు అధికారులు సర్వసిద్ధం చేశారు. గర్భాలయాన్ని మామిడి తోరణాలు, అరటి ఆకులు, విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన క్యూలైన్లో ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. భక్తుల రద్దీ అధికంగా ఉండొచ్చనే అంచనాలతో 60వేల లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉంచారు. తెల్లవారుజామున 5గంటల నుంచి అధికారులు మరో 40వేల లడ్డూల తయారీకి సిద్ధం చేశారు. ఒక లక్ష లడ్డూలు, పులిహోరతో పాటు ఇతర ప్రసాదాలు అందుబాటులో ఉన్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. భక్తులకు దర్శించుకునేం దుకు లఘు దర్శనం ద్వారా భక్తులకు త్వరిగతిన దర్శనం కలిగించే ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మహిళలు, దివ్యాంగులకు ప్రాధాన్యం

యాదగిరిగుట్ట దేవస్థానంలో స్వామివారిని దర్శించుకునేందుకు కొత్త సంవత్సరం నుంచి మహి ళలు (చంటిపిల్లల తల్లులు), దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక సమయం కేటాయించి ప్రాధన్యతను పెంచారు. కొత్త సంవత్సరం నుంచి ఉదయం 11 నుంచి 11.30 తిరిగి సాయంత్రం 5 నుంచి 5.30గంటల వరకు ప్రత్యేక సమయం కేటాయించి బ్రేక్ దర్శనం మాదిరిగా దర్శనం కల్పించనున్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి, తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. కాగా హరిహరులకు నిత్యపూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.24,94,654 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. ధనుర్మాసోత్సవాలు 16వరోజుకు చేరాయి.

సంక్షేమ ఫలాలు ప్రజల చెంతకు


రాయిగిరిలో జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

(5వపేజీ తరువాయి): అంశాలపై నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించాం. ప్రత్యేకాధికారులతో టెలీకాన్ఫరెన్స్, వీడియో కాల్, గూగుల్ మీట్‌లు నిర్వహిస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దని ఆదేశాలు

కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై అర్జీలు అందజేస్తున్నారు. అందులో అధిక మొత్తంలో రెవెన్యూపరమైన అర్జీలే ఉంటున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశాలు జారీచేస్తున్నాం. రైతుల భూములు వేరే వారి ఖాతాల్లో వెళ్లడం, పేరు తప్పుగా పడటం, సర్వే నెంబర్లు మార్పు కావడంతో పాటు, భూమి ఉండి కూడా లేని వారిగా మారిపోయినవారు ఉన్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కోర్టు కేసులు ఉన్న భూములు కాకుండా, జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పరిష్కారించాల్సిన దరఖాస్తులన్నింటినీ పూర్తిచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. క్షేత్రస్థాయిలోకి వెళ్లి తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నాం. అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు కూడా నిత్యం పర్యవేక్షిస్తున్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీచేశాం. ఆయా శాఖల అధికారులు వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని ఆదేశిస్తున్నారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న పనులపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

సిమెంట్ పరిశ్రమను అడ్డుకుంటాం: ఎమ్మెల్యే కూనంనేని

రామన్నపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న కాలుష్యకారక సిమెంట్ పరిశ్రమను అడ్డుకుంటామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివారావు అన్నారు. పట్టణంలోని సీపీఐ నాయకులు సోమవారం నల్లగొండలో జరిగిన సభలో సిమెంట్ పరిశ్రమను అడ్డుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనావాసాలు ఉన్న ప్రదేశంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఎలా పెడతారని? ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు వ్యతిరేకించిన తర్వాత వారు ఎలాంటి నిర్మాణం చేపట్టరాదని అన్నారు. ప్రజలు నిర్వహించే తాను ప్రత్యక్షంగా వచ్చి పాల్గొంటానని, ఆదానీ గానీ ఎవరైనా గానీ సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయనీబోమని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో నాయకులు లొగండి శ్రవణ్, రామన్న ఊట్కూరి నర్సింహ ఎర్ర రమేష్‌గౌడ్ బాలగోని మల్లయ్య, భగవంత, వెంకటయ్య, శివరాత్రి సమ్మయ్య, రచ్చ యాదగిరి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

వలిగొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యవర్గసభ్యులు కూర శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గర్దాసు నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం వలిగొండ పట్టణంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. సీపీఎం నాయకులు నానంచార్ల రమేష్, కొండూరు సత్తయ్య, వేముల లక్ష్మయ్య, ధ్యానబోయిన యాదగిరి, అండమ్మ పాల్గొన్నారు.

'వ్యవసాయ కార్మికులకు 12వేలు ఇవ్వాలి'

వలిగొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భూమి లేని వ్యవసాయ కార్మికులకు 12వేలు రూపాయలు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి, తెలంగాణ ఉద్యమారులు జేఏసీ రాష్ట్ర కోశాధికారి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజాసంఘాల కార్యాయలంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గాజుల అంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డి బిక్షపతి, కొండ కిష్టయ్య, నాయకులు గర్దాసు నర్సింహ, యాదగిరి పాల్గొన్నారు.

విద్య వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

వలిగొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్య వ్యాపారీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ 55ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కంచారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ జరఫాతిమా, ఎసోబ్, నరేందర్, ఫర్హీన్ సాయి, మణిదీప్‌రెడ్డి, లక్ష్మణ్, వినయ్, ప్రసాద్, ప్రశాంత్, కార్తక్ పాల్గొన్నారు.